క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వర్ని: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా సరిహద్దు గ్రామమైన మల్లారం శివారులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, డబ్బులు, పార్టీల ఎన్నికల సామగ్రి భారీ స్థాయిలో తరలించకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను నియమించి క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తున్నారు.

కందకుర్తి చెక్‌పోస్టు వద్ద..



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. రెంజల్ ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తున్నారు. మద్యం, డబ్బు రవాణా కట్టడికి ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

ఉమ్మెడ చెక్‌పోస్టు వద్ద..



నందిపేట: నందిపేట మండలం ఉమ్మెడ చెక్ పోస్టును అసిస్టెంటు రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్ గురువారం తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అధికారులు ఉమ్మెడ వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. నందిపేట తహసీల్దార్ ఆనంద్, సీనియర్ అసిస్టెంటు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



బోధన్: ఇటీవల నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ పుంజాల అలేఖ్య వినయ్ కుమార్‌ను గురువారం హైదరాబాద్‌లో బోధన్‌కు చెందిన తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేరణ పోటీల్లో ప్రతిభ



మాక్లూర్: ప్రేరణ పోటీల్లో దాస్‌నగర్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ నెల 20న డిచ్‌పల్లి మండలం తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో డిగ్రీ కళాశాలకు చెందిన కామర్స్ విద్యార్థులు సవిత, మమతలు పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే వ్యాసరచన పోటీల్లో సీహెచ్ శ్రీజ ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరు యూనివర్సిటీ ప్రొఫెసర్ యాదగిరి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభినందించారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బోధన్: సన్‌ఫ్లవర్‌ను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాలూర సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్ రైతులను కోరారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్‌ఫ్లవర్ పంట కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ రమేష్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,760లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు అల్లె జనార్దన్, రామక్రిష్ణ, హోట్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ డిజిట్‌తో అధికారం కైవసం

- స్వయంకృతాపరాదంతో ఆర్మూర్ మున్సిపాలిటీని చేజార్చుకున్న బీఆర్ఎస్
- ఫిరాయింపులతో బలోపేతమైన కాంగ్రెస్
- ఊహించని రీతిలో ఆర్మూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం
- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా లావణ్య ఎన్నిక





మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు.. ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

ఆర్మూర్: 'బండ్లు ఓడలవుతాయి.. ఓడలు బండ్లవుతాయి'' అనే నానుడి ఆర్మూర్ మున్సిపాలిటీలో నిరూపితమైంది. 2020 జనవరిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో 36 వార్డుల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ పడినప్పటికీ 14వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ఇంతియాజ్ హుస్సేన్ మాత్రమే విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఒక స్థానంలో ఎంఐఎం, బీజేపీ ఆరు స్థానాలు, బీ(టీ)ఆర్ఎస్ పార్టీ 23 స్థానాల్లో విజయం సాధించాయి. దీంతో స్వతంత్రులుగా విజయం సాధించిన ఐదుగురు కౌన్సిలర్లు సైతం బీ(టీ)ఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. వీరి వెంటే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయాడు. ఇక కాంగ్రెస్ పార్టీకి ఆర్మూర్ మున్సిపాలిటీలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. ఎంఐఎంను కలుపుకొని 30 మంది కౌన్సిలర్ల బలంతో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంది. ఈ బలాన్ని పరిశీలిస్తే ఇక ఐదేళ్ల పాటు ఆర్మూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి ఢోకా లేదనిపిస్తుంది. కానీ అనూహ్యంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఓటమి పాలు కావడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య మనస్పర్థలు ఒక్కసారిగా బయటపడ్డాయి. బీఆర్ఎస్ పార్టీలో చేరిన 21 మంది కౌన్సిలర్లు ఒక్కతాటిపై ఉండి తిరుగుబాటు చేసి తమ పార్టీకే చెందిన చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానానికి పట్టుబట్టారు. దీంతో జీవన్‌రెడ్డి సైతం తమకు ఉన్న కౌన్సిలర్ల సంఖ్యా బలంతో తమ పార్టీ ఆధీనంలోనే ఆర్మూర్ మున్సిపాలిటీ ఉంటుందని భావించి వారికి అనుకూలంగా వ్యవహరించారు. కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందనే రిజల్టు సాధించడానికి వారు హైకోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. అయినా తమకు అనుకూలంగా పరిస్థితులు లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి చెప్పా పెట్టకుండా విడతల వారీగా అన్ని గ్రూపుల్లోని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ బలం 36 మందిలో 30కి చేరింది. వీరి వెంటే ఎంఐఎం కౌన్సిలర్ సైతం నిలవడంతో 31కి చేరింది. నాలుగేళ్ల క్రితం టెక్నికల్‌గా సింగిల్ డిజిట్‌తో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ ఉన్న ఒక్క కౌన్సిలర్‌ను కోల్పోయినా ప్రస్తుతం జరిగిన పార్టీ ఫిరాయింపులతో బలం పెంచుకొని ఆర్మూర్ మున్సిపాలిటీని హస్తగతం చేసుకొంది. లావణ్య మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

మున్సిపల్ చైర్ పర్సన్ బయోడేటా

పూర్తి పేరు : వన్నెల్‌దేవి లావణ్య
తండ్రి పేరు : నేల లింబన్న
తల్లి పేరు : రాజుబాయి
భర్త : వన్నెల్‌దేవి (అయ్యప్ప) శ్రీనివాస్
పుట్టిన తేదీ : 02-05-1983
పుట్టిన గ్రామం : బాల్కొండ
అత్తగారి గ్రామం : ఆర్మూర్
పిల్లలు : అయ్యప్ప శ్రీఅనిరుద్, అయ్యప్ప శ్రీలోకేష్
విద్యార్హత : ఇంటర్మీడియట్
ఉద్యోగం : గృహిణి
కౌన్సిలర్‌గా : 2020లో బీఆర్ఎస్ నుంచి మొదటి సారిగా విజయం

పదవి దక్కక కంటతడి



దుఃఖంతో వెళ్తున్న కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో మూడు పర్యాయాలు వరుసగా కౌన్సిలర్‌గా విజయం సాధించి హాట్రిక్ రికార్డును సొంతం చేసుకున్నా మున్సిపల్ చైర్ పర్సన్ పదవి దక్కక పోవడంతో 2వ వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత కంట తడి పెట్టింది. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. 2008 మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా 2వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా న్యాయవాది ఖాందేశ్ శ్రీనివాస్ భార్య ఖాందేశ్ సంగీత విజయం సాధించారు. కౌన్సిలర్‌గా హాట్రిక్ విజయాన్ని మూట గట్టుకున్నప్పటికీ ప్రతీ సారి చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో చుక్కెదురు కావడంతో ఆమె కంటి పెట్టుకోవడం కూడా హాట్రిక్‌గా మారిపోయింది.

టైలరింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సెర్ప్ ఏపీఎం కుంట గంగాధర్

కమ్మర్‌పల్లి: బడి పిల్లల యూనిఫామ్ కుట్టే సౌకర్యాన్ని గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ఏపీఎం కుంట గంగాధర్ కోరారు. గురువారం కమ్మర్‌పల్లి రైతు వేదికలో నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులతో పాటు, ఔత్సాహిక మహిళల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 2933 మంది విద్యార్థుల ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక డ్వాక్రా మహిళలకే అప్పగించాలని నిర్ణయించిందని తెలిపారు. ఒక్కో యూనిఫామ్‌కు రూ.50 చెల్లిస్తామన్నారు. 41 మంది సభ్యులు స్కూల్ యూనిఫామ్స్ కుట్టడానికి ముందుకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సీసీలు రవికుమార్, భాగ్యలక్ష్మి, పీరియా, అలేఖ్య సిబ్బంది ధనలక్ష్మి అనసూయ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌లో జాతీయ రహదారి-63 పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై నీరు వృథాగా ప్రవహిస్తోంది. మెట్‌పల్లి ప్రాంతానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు బయటకు వస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తాం



పాల్గొన్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: రానున్న రోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ధర్మసమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం కేవలం ధర్మ సమాజ్ పార్టీతో మాత్రమే సాధ్యమన్నారు. తెలంగాణాలో పీడిత ప్రజలు రాజ్యం తేవడమే మన లక్ష్యమన్నారు. జిల్లా అధ్యక్షుడు కండల సుమన్, నాయకులు ప్రేమ్ కుమార్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



వేల్పూర్: పడగల్ గ్రామంలో గురువారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి, కానుకలు సమర్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మొదటి వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన గురువారం దేవత మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రుక్మిణీ విఠలేశ్వర స్వామి కల్యాణం జరిపారు. పల్లకి సేవ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీక్షేత్రం నాచారం గుట్ట మధుసూదనానంద సరస్వతి స్వామి హాజరై ప్రవచనాలు చెప్పారు.

ఎస్సారెస్పీ 'నల్లమట్టి'పై ఆశలు

- వేగంగా తగ్గుతున్న నీటి మట్టం
- ఈ ఏడాది నల్ల మట్టి లభిస్తుందని రైతుల ఆశాభావం
- ప్రభుత్వమే సరఫరా చేయాలని రైతుల డిమాండ్



ప్రాజెక్టు లోపల నల్లమట్టిని తవ్వుతున్న పొక్లెయిన్ (ఫైల్)

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లకే కాదు.. దాని నల్ల మట్టికి కూడా డిమాండ్ అధికంగా ఉంది. ప్రాజెక్టులోకి వరదలు తక్కువగా వచ్చిన సంవత్సరం వేసవిలో అధికంగా నల్లమట్టిని తవ్వి పంట భూములకు రైతులు తరలించుకు పోతారు. ప్రస్తుత సంవత్సరం కూడా ఎస్సారెస్పీలో నల్లమట్టి అధికంగా లభించే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. ప్రస్తుతం పసుపు పంటకు అధికంగా ధర పలకడంతో పసుపు సాగు చేసే నేలల్లో భూసారం పెంచటానికి రైతులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదల వల్ల మట్టి కొట్టుకు వస్తుంది. ప్రతి సంవత్సరం 0.8 టీఎంసీల పూడిక మట్టి కొట్టుకు వస్తుందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.

ఈ ఏడాది ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల వరదలు వచ్చినప్పటికి నీటి వినియోగం ఎక్కువ జరగడం వల్ల ప్రాజెక్టులో నీటి నిల్వ ప్రస్తుతం 19 టీఎంసీలకు పడిపోయింది. మరో 10 రోజులు నీటి విడుదల చేపట్టాల్సి ఉంది. ఆ తర్వాత ప్రాజెక్ట్ నుంచి నల్ల మట్టిని తరలించటానికి వీలుకలుగుతుంది. ప్రాజెక్ట్ నుంచి నల్ల మట్టిని ప్రభుత్వమే రైతులకు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా నల్ల మట్టిని సరఫరా చేసింది. అదే మాదిరిగా ఎస్సారెస్పీలో కూడ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి రైతులకు నల్ల మట్టి తరలించాలని వేడుకుంటున్నారు. ప్రాజెక్టులో పూడిక తొలగడంతో పాటు, రైతులకు తక్కువ ధరలో మట్టి సరఫరా జరుగుతుందంటున్నారు.

కొందరి చేతుల్లోనే నల్లమట్టి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ప్రతి సంవత్సరం బ్యాక్ వాటర్ నిల్వ ఉండే ప్రాంతం నుంచి మట్టిని తరలిస్తారు. కానీ 2015లో ప్రాజెక్ట్‌లో నీటి మట్టం పూర్తిగా తగ్గడంతో వందల ప్రొక్లెయిన్‌లతో నల్ల మట్టిని తవ్వారు. కాని నల్ల మట్టి తవ్వకాలు కొందరి చేతుల్లోనే ఉండిపోయాయి. ప్రాజెక్ట్ అధికారులను ప్రసన్నం చేసుకుని నల్లమట్టిని తీసుకున్నారని విమర్శలు జోరుగా వచ్చాయి. దీంతో సిండికేట్‌గా ఏర్పడి రైతులకు ఎక్కువ ధరకు నల్ల మట్టిని తరలించారు. డంపరుకు రూ.6 వేలు, టిప్పరుకు రూ.3 వేల ధర విధించారు. ప్రస్తుత ఏడాది కూడ నల్ల మట్టి లభించే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే ప్రాజెక్ట్ అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కొందరు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వమే నల్లమట్టిని తరలించే ఏర్పాటు చేస్తే ధర తగ్గడంతో పాటు అందరికి సమాన అవకాశం లభిస్తుంది. ప్రాజెక్ట్ అధికారులు, పాలకులు ఆ దిశగా కృషి చేసి రైతులకు సేంద్రియ ఎరువుల భారం తగ్గించాలని వేడుకుంటున్నారు.

పెట్టుబడి తగ్గుతుంది



ప్రాజెక్ట్‌లో నల్లమట్టిని ప్రభుత్వమే తవ్వించాలి. మిషన్ కాకతీయ పథకం ద్వారా తవ్వకాలు జరిపి రైతులకు నల్లమట్టిని సరఫరా చేసినట్లు ప్రాజెక్ట్‌లో కూడా సరఫరా చేసి అందిస్తే రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. అంతే కాకుండా ప్రాజెక్ట్‌లో కూడా పూడిక తొలగుతుంది. ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– ఎల్లారెడ్డి, రైతు

ఉచితంగా వైద్య సేవలు అభినందనీయం

పెర్కిట్(ఆర్మూర్): మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మధుశేఖర్ అభినందనీయుడని సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం 45వ సర్జికల్ క్యాంపు విజయవంతంగా నిర్వహించారు. దీంతో పట్వారి తులసి కుమార్, చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్‌ను పెర్కిట్‌లోని ఎంజే ఆస్పత్రిలో ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి సిబ్బంది సందీప్, వాసు, ఇబ్రహీం, రాము, సాగర్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

వర్ని(మోస్రా): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో దుకాణదారులు, ఇంటి యజమానులు పంచాయతీలకు బకాయి ఉన్న ఇంటి పన్నులను మార్చి నెలాఖరిలోపు చెల్లించాలని మోస్రా ఎంపీవో రఫీ ప్రజలను కోరారు. గురువారం మోస్రా మండల కేంద్రంలో పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, కృష్ణ, మూర్తి, మహేశ్వరి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గాదేపల్లి-చిన్నయానం అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు



పిప్రిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండలం గాదేపల్లి, చిన్నయానం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్ష వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూచనలు, సలహాలిచ్చారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిప్రి సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ప్రతినిత్యం చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శి మురళీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

రెంజల్(బోధన్): పోషకాలు పుష్కలంగా లభించే ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకీబాయి తెలిపారు. గురువారం నీలా గ్రామంలో ప్రీస్కూల్, పోషణ పక్వాడ కార్యక్రమాలను నిర్వహించారు. రక్తహీనత రాకుండా ఉండాలంటే విటమిన్లు సమృద్ధిగా లభించే చిరుధాన్యాలు, మొలకలు, రాగి, శనగ, జొన్న, ఆకుకూరలు వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే అందరికీ మేలు

ఎడపల్లి(బోధన్): పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో జానకమ్మ, సూపర్‌వైజర్ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.



నీలాలో..



ఎడపల్లిలో..

పశువులకు 'గాలికుంటు' టీకాలు



ధర్మోరాలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు



రామన్నపేట్‌లో..

మాక్లూర్: మాందాపూర్, ధర్మోరా గ్రామాలలో గురువారం మండల పశు వైద్యుల ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జాతీయ పశు వ్యాధుల నివారణ వారోత్సవాల్లో భాగంగా గ్రామాలవారీగా శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండేలు ఈ సందర్భంగా తెలిపారు. పశువుల పెంపకందారులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. రెండు గ్రామాల్లో కలిపి 495 పశువులకు టీకాలు వేసినట్టు తెలిపారు. పశు వైద్య సిబ్బంది వినిత, గంగాజమున, అహ్మద్‌పాషా, సుధీర్, జైలసింగ్, శ్రీనువాస్, గంగాధర్, పుష్ప, లక్ష్మిలు పాల్గొన్నారు.

రామన్నపేట్‌లో..

వేల్పూర్: రామన్నపేట్‌లో గురువారం మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది మౌలానా, దయానంద్, వాజిద్ పాల్గొన్నారు.

అన్వేష్ రెడ్డికి ఘన స్వాగతం



వేల్పూర్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన సుంకెట అన్వేష్‌రెడ్డి మొదటిసారి స్వగ్రామం పచ్చలనడ్కుడకు రావడంతో వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు గురువారం ఘన స్వాగతం పలికారు. ర్యాలీ చేపట్టారు. గోవింద్‌పేట్, జాన్కంపేట్, ప్రచ్చల నడ్కుడ గ్రామాలలో శాలువాలతో సన్మానం చేస్తూ టపాకాయలు కాల్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, గుడాల మోహన్, రాము, మహేందర్, జేమ్స్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



ఎడపల్లి(బోధన్): స్థానిక తహసీల్ కార్యాలయాన్ని గురువారం బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. వచ్చిన రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



వర్ని: డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డిపై సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గినందుకు హర్షం వ్యక్తం చేస్తూ వర్ని మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ బాబా, జాకోర సహకార సంఘం అధ్యక్షులు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఓం భీమ్ బుష్ (తెలుగు) - 4.05
లైన్‌మెన్ (తెలుగు) - 7.15
గామి (తెలుగు) - 10.00

స్క్రీన్-2 – ప్రేమలు (తెలుగు) - 12.00, 3.15, 6.30, 9.45

స్క్రీన్-3 – ఓం భీమ్ బుష్ (తెలుగు) - 11.00, 2.10, 6.05, 9.15
రజాకార్ (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00